పాతకాలపు పోకడలు పోలేదు

పాలకడలి శయన రారా నే పిలువగా నే" - సాతాని జియ్యరు చిరుచిరతల మేళవింపుతో తంబురా మీటుతూ తెల్లవారు జామున జాలిగా పాడుతూ ఉన్న ఆ పాట చాలమందిని మేలుకొలుపుతోంది. నాగభూషణంగారు లేచి ముఖప్రక్షాళనం చేసుకొని 'శ్రీరామ కవచమ్' పఠిస్తున్నారు. ధనుర్మాసం. దూరాన్ని విష్ణ్వాలయంలో జేగంటలు మ్రోగుతున్నాయి. తిరుప్పావై, ద్రావిడ వేదం పఠిస్తున్నారేమో - సమూహము చేత కంఠాలు తప్ప, ఆ చదివేది స్పష్టంగా ఏమీ వినిపించడం లేదు.

"అంబా పలుకు జగదంబా పలుకు, అలివేణీ పలుకు నీరజపాణీ పలుకు - అయ్యవారు ఏదో ఆలోచిస్తున్నారు - మహాకష్టాలలో ఉన్నారు. మంచుకొండలాగ వచ్చిన కష్టం మబ్బు తునకలాగ మటుమాయం అయిపోతుంది. మహామంచి మనసు. కాని తెలియకుండానే చిక్కుల్లో పడతారు. అంబను సేవించు - అన్నిటినీ పాలించు దొరా!" అన్నాడు బుడబుక్కలవాడు. అతని ఘంటాధ్వానంలో, డమరుకం బుడబుడక్కల చప్పుడులో అతని జోస్యం కూడా కలిసిపోయింది తప్ప - నాగభూషణంగారు దవిని పట్టించుకోలేదు. 'రామనామ తారకం భక్తిముక్తిదాయకం' అని పాడుకొంటున్నారు. సంక్రాంతి వారం - కొత్తధాన్యం ఇండ్లల్లోనూ, గాదుల్లోను నిండుతున్నాయి. మూడోయింటి పాపమ్మగారి దంపుళ్లచావిట్లో, అరుగురు కొంపడుచులు కొత్తధాన్యం రాతిరోలులో వేసి దంచుతున్నారు. వాళ్ల పాటే అది—.

'కోడలా! కోడలా! కొడుకు పెళ్లామా. ఓయమ్మ.'

ఆ పాటుకి వేడివేడి అటుకులు గరగరగ్గా - గరంగరంగా, సాగుతున్నాయి-నాగభూషణంగారు దీర్ఘంగా నే

"శ్రీవాత్సవ"

ఆలోచిస్తున్నారు. ఆ పాటలోని మాటలు మర్మఘాతంలాగ తగులుతున్నాయి. అప్పుడు- తనకొడుకు చెట్టంతవాడయ్యాడు. ఈపాటికి పెళ్ళికావలసిందే - కాలేదు. మొదట రెండు మూడు సంబంధాలు చూచి తానే వద్దన్నాడు. అవి ఒప్పుకున్నా తీరిపోవునేమో! పిల్లవాడికి అంగారక దోషం. రాహుమంగళ యోగం. వాళ్ళిద్దరు అకళత్రస్థానంలోనే ఉన్నారు. ఈ కాలంలో కూడా జాతకం అంటే అంత చాదస్తంగా చూస్తున్నారు. పిల్లవాడికి పెళ్లి కాలేదు. చదువు పూర్తికాలేదు. ఆ బి. యే. తిరిగి ఈ సంవత్సరం దండయాత్ర చేస్తున్నాడు. ఈయేటతోనైనా వదలిపోతే - ఏదో ఒక పనిలో ప్రవేశపెడితే అక్కడికది పూర్తిఅయ్యేది! ఏదీకాలేదు మళ్ళీ అట్టి సంబంధాలు వచ్చినట్టు లేదు. ఆ కట్టావారి అమ్మాయిని చూస్తే - అబ్బాయికి అసలు నచ్చలేదు. వీడన్న యిలాగంటే యెలాగ? ఆడదానికి అందం ఏమిటి? 'ఎక్కడి కక్కడికే శ్రీ మహాలక్ష్మి!' వీడికి పెళ్ళికాకపోతే కష్టమే! బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికి రాదు అంటారు మరి. వీడి వయస్సుకి అప్పుడే తన పెళ్లి అయింది; బిడ్డను ఎత్తుకున్నాడు ఏమైనా సరే ఈ వేసవిలో పెళ్లిచేసెయ్యాలికి అదటుంచు - ఇప్పుడు పీకలమీదికి బ్యాంకు వాయిదా వచ్చిపడింది కదా! సమయానికి ఇవ్వకపోతే - వడ్డీ పెరిగిపోతుంది. కొత్త ధాన్యం వచ్చింది. అయితే అది అయిన కాడికి అమ్మెయ్యాలి. తక్కువ ధర! బస్తా ఒక్కంటికి ఒక పుంజీ రూపాయలు తేడా ఉంటుంది. ఎనభైబస్తాలు మూడువందల పై చిల్లర నష్టం! క్రిందటేడు గృహప్రవేశం, సంతర్పణ లేకపోతే - ఆ ధాన్యం మిగిలేదే. అది తిండికే సరిపోలేదు. కీడులో మేలు. ఈయేడు బాగా పండాయి. పల్లపు పొలం నూరు బస్తాలు రాలుస్తే, మెరకపొలాలన్నీ చేరి మరో నూరుబస్తాలు దిగుబడి యివ్వవా? చూద్దాం! బాగానే ఉంది - ఈసంవత్సరం దండుగ! పెద్దమ్మాయి రానేరాదు కనక, చిన్నమ్మాయీ అల్లుడూ రావాలి. వాళ్లకి బట్టలు ఇవ్వక తప్పదు. చిన్నమ్మాయికి తొలికాన్పు కనక అఖర్చులన్నీ తానే భరించాలి. ముసలావిడ ఎంతో ముచ్చటపడుతూ ఉంది ఆవిడ చాదస్తం మరీని - సంక్రాంతికి శివాలయంలో అభిషేకం చేయిస్తుందట!



లంబాడిపిల్ల... చీడీలమీద పడుతున్నట్టు వాలిపోయింది.... ఇది మందు ప్రభావమా?
ఈమనిషి దొంగయెత్తు వేసిందా?

[illegible]కి ఖర్చు కాక తప్పదు పోనీ తాను [illegible]కపోయినా ఇల్లాలు అయినా [illegible]చిదే పుణ్యమూ పురుషార్థమూ కలిసివస్తాయి

'హరహరా! సాంబశివశివా!

కైలాస వాసా!

జంగందేవర శంఖంపూరించి, గంటవాయిస్తూ వస్తున్నాడు ఆపాట అతనిరాగం వింటే, ఎంత నిరుత్సాహం పొందేవాళ్లకయినా కొత్తఆశలు పుట్టుకొనివస్తాయి

ప్రొద్దెక్కింది ఆవిడ వీధిలో ముగ్గులు పెట్టూ ఉంది. నిమ్మకుస్తులు - ఎదురింటి వాళ్లకోడలు - పండుగలకి పుట్టింటికి వెళ్లలేదు ఇక్కడే ఉండిపోయింది వాళ్ల మామగారు కర్కోటకుడు తాపట్టినపందేటికి మూడేకాళ్లు అనేరకం కొడుక్కి వాచీ, కాని యివ్వలేదని వియ్యాలవారిమీద పంతం! ఆ కోడలు పట్టి చెవల వాజెమ్మ తండ్రిచాటువాడు! ఎంతచెప్పితే అంతే - గిరిలోంచి దాటి బయటికి రావడమే అసంభవం ఆ పిల్ల అదృష్టం మరి! ఎప్పుడుచూచినా కలకలా నవ్వుతూ ఉంటుంది తన నవ్వులాగే ఎంత పెద్ద ముగ్గు పెట్టిందో? గుమ్మానికి ఎంత నిండుగా ఉందో? 'సెలోతీసి దానిలో గుమ్మడి పూలు, గొబ్బిబంతులు చక్కగా పెట్టింది ఈ బంతిపూలు చా[illegible]పూలు దండలు గుచ్చిగుమ్మానికి కట్టారు ఎంత బాగున్నదో, వాళ్లయిల్లు! మన దొడ్లో [illegible]పూలూ చేమంతిపూలు బాగా పూస్తాయి కాని ఎందుకు? వాటిని మా చేవాళ్లేలేరు. ఇరుగు పొరుగువాళ్లు కోసుకొనిపోతారు అమ్మాయి వచ్చిన తర్వాత దండలు కట్టుందేమో! దానికి అలాంటి శ్రద్ధలు లేవు [illegible] చేసేద ఒకటా? ఏమి చేస్తుందో! మన యింటికి ఇంతవరకు పండుగకళే రాలేదు మరి!

స్నానం చేసి వచ్చేలోపున - అబ్బాయి వచ్చేవాళ్లకి బియ్యం పడ్డిస్తే మంచిది! వచ్చేవాళ్లు వెళ్లేవాళ్లు బిచ్చగాళ్లు, నాగభూషణం గారు బియ్యం వేసిన పెద్దబుట్ట కొడుకు వీరభద్రానికి అప్పగించి వెళ్ళిపోయారు

లతాంతార్ధ్రి రాగంబు లంబాడి

'బొజ్జగల తల్లో, బొజ్జగలతల్లీ—

బొజ్జకోడలా స్తదో బొజ్జకోడలా స్తదీ?' అంటూ కోయమనిషి - కళ్లు తిప్పుకుంటూ మెడలోని పూసలు మిలమిలలాడిస్తూ వచ్చి పాడుతూ ఉంది.

బొజ్జగలతల్లి సరి - బొజ్జకోడలు బొజ్జకోడలు ఏమిటి? నాకువద్దు. నే నిన్నాళ్లు పెళ్లి చేసుకోలేకే నేమిటి? మంచి పిల్ల రావాలనే ఇంతసేపు ఆగాడు అబ్బాయి! ఆ యెదురింటి వెంకుపంతులుగారి కోడలు- ఎంతచక్కగా ఉంటుందో! గుమ్మడిగింజ లాగ అలాంటిపిల్ల తనకి భార్యఅయితే?— ఆ పిల్లకి తగిన మొగుడుదొరకలేదు, కాకి ముక్కుకి దొండపండు! ఆ శ్రీరామమూర్తి చూడు—నల్లగా కొఅవిడెయ్యంలాగ ఉంటాడు. వాడు చుట్టలుకూడా కాలుస్తాడు. చుట్టలవాసన ఎలాగ భరిస్తుందో!—అంత సుకుమారమైన ఆ అమ్మాయి. తనకి ఆవాసనే గిట్టదు!—దుర్భరం! వాళ్ళు ఎలాగ బాధపడితేనేం? ఆ పిల్లకి మొగుడంటే ఇష్టమల్లే ఉంది. ఎపుడుచూచినా ముఖం నవ్వుతూ ఉంటుంది. వీడికి యింతోటి, మహాయోగ్యు వాచీకావాలట, వాచీ. అది కొనిస్తే గాని పండగకి వెళ్ళడట. మొగంవాచీ టట్టు చీవాట్లు పెట్టాలి, వాడికి వాచీకాదు. వాళ్ళగొడవ మనకెందుకు? నా పెళ్ళిమాట యీ సంవత్సరం అయిపోతే బాగానే ఉంటుంది. నన్ను ఏ పిల్లచూచినా అలాగ చురచురలాడుతూ చూస్తుందే! అమ్మ నన్ను కోఅకంచు అంటుంది. నేనేం చేశానని? నేను బాగాఉండనా? బాగానేఉంటానే! మా విస్సన్న మావయ్యకూతురు నన్నింతో మెచ్చుకునేది. ఆ పిల్లకి పెళ్ళి అయిపోయిందికాని దానిని చేసుకున్నా బాగుండిపోను. ఎవరికినచ్చిన పిల్లను వాళ్లకు చేస్తే లోకంలో ఇంతమంది 'దేవదాసు'లు లేకపోదురు! కొంపదీసి నేను దేవదాసును అవుతానా? ఎందుకు అవుతాను—నాకలాంటి 'పార్వతీ' లేదు. 'చంద్రముఖీ' రాదు!

వెంకుపంతులుగారి కోడలికి గిరీశం లవ్ లెటర్సు రాశాడట. ఈ అమ్మాయికేనా? అతనెప్పటివాడో? ఛీఛీ! తప్పు తప్పు! ఇపుడు నాకేసి ఆ అమ్మాయి నవ్వుతూ చూస్తుంది. మా యింటికివస్తే చాలకోపంగా చూస్తుంది. అర్థంఏమిటి? ఆడవాళ్ళ చూపులకి అర్థం ఏమిటి? నారికేళ పాకము గదే కామినీ హృదయ కావ్యరస గ్రహణమ్మనెచ్చెలీ...నాటకంలో ఏ రాగంలో పాడాడు చెప్మా?బాగాఉంది పద్యం?

ఈ ధోరణిలో వీరభద్రం ఆలోచిస్తున్నాడు.

"బొజ్జగలతల్లీ...బాబూ, మీకు పెట్టమీద మనస్సుపోతది. పెట్టమందు ఇస్తాను తీస్తావా?"అంటూంది కోయపడుచు! అలాగంటూ చేరువగావచ్చి మత్తుమందు వేసినట్టు మాటాడుతూఉంది!

అవును—వీళ్ళు మందు లిస్తారట—ఆ మందులు పనిచేస్తాయా?

"మీకు చక్కని చుక్కమీద ఉంది—ఈ మందుతీసి బొట్టుపెట్టితే పెట్ట బుట్టలో పడుతాది తీయ్‌దొరా!" అని తన బుట్టలో నించి బూడిదతీసి యేదో చెప్తూవుంది! నిజమేనా? అని వీరభద్రం లోభపడ్డాడు. ఒక తవ్వెడుబియ్యం కోయదానిబుట్టలో వేశాడు --స్నానంచేసి—కొత్తబట్టలు కట్టుకొని అది నొసట పెట్టుకొని—ఆ బొట్టు ఎవరుచూస్తే వాళ్ళు వెంటపడతారట! మందు పనిచేస్తే బాగానే ఉంటుంది! ఇదంతా ఎలాగ పనిచేస్తుందో? తీరాప్రయత్నిస్తే! ఒకటిరెండు చెడితేనే తప్ప వైద్యుడు కాడు.

తాటాకు గిలకబుపట్టుకొని ఎటుకలది వస్తోంది. పిల్లలకికొనాలి. ఇంతలో వెదురు కఱ్ఱలతో చేసిన బూరాలు. ఆ కోయదొర ఎంత చక్కగా వాయిస్తాడో! తమాషాగా ఉంది. ఫ్లూటులాగేఉంది. ఇదే బన్సారీ అంటారు. వాడిలాగ తాను వాయించగలడా? తవ్వెడుబియ్యం ఇస్తే ఒక పిల్లనగ్రోవి!

"ఏమిట్రా అబ్బాయి! భద్రం! బియ్యమన్నీ ఖాళీచేశావు. అడ్డమైన సామానులు ఈ బియ్యం పడబోసికొంటున్నావు: వెళ్ళు స్నానంచేసిరా" అని ఒక్క గదుముగదిమి నాగభూషణంగారు వీధి అరుగుమీద నించున్నారు. బిళ్లగోచీపంచె విభూతి పిండికట్లు. అపరమాహేశ్వర మూర్తిలాగున్నారు. ఆయన తలంటేనెఅసిందికానిమనిషి పిడుగులాగ ఉంటాడు. కొంతమంది ఎంతకాలమైనా నిత్యయౌవనులుగా ఉంటారు. నాగభూషణంగారు ఆ కోవలో చేరినవాడే! అరే! ఆ పాముల బుచ్చిగాడు. ఎపుడుచూచినా ఒకలాగే ఉంటాడు, కడ్డీముక్కలాగ! ఆ నాగస్వరం ఊదితే-చక్కగా ఉంటుంది. ఎప్పుడూ తప్పతాగి ఒళ్ళుతెలియకుండా ఉండేవాళ్ళు; వీళ్లు ఈ రోజుల్లో ఎలాగుంటున్నారో! ఏం? బ్బాగానే ఉంది. పెద్దకాపుగారి దగ్గర రెండొందలు దాచుకున్నాడట వీడు. క్రిందటేడు వీడి కూతురిమీద తప్పేస్తే అది

తీసుకోవడానికి ఆ రెండోందలూ అయిపోయాయట. నాగస్వరం బాగా ఊదుతాడు, పాముల బుచ్చెయ్య. వాడికొడుకే ఆ వచ్చేవాడు. వీడూ వాయిస్తాడు నాగ, సారపు కాయ!

నాగస్వర మూదితే నాగులకు నిద్ర...

మల్లికొసులవాళ్ళు - ఏటా వచ్చి నడవలో ఆటకట్టారు. "ఇక్కడ వెలిగిన దీపారాధన తిరిగి కరణంగారి లోగిలివద్ద వెలుగో!" అంటాడు. కఱ్ఱసాము బాగా చేస్తారు వాళ్లు. ఈ కాలపువాళ్లకి ఏమీ చేతకాదు సుమా!

వాడింకా వీరణం తాషామర్పాలాంటి డమారం వాయిస్తున్నాడు... పెద్ద చప్పుడు. వద్దు...బియ్యం వేసి పంపించెయ్యాలి. లేకపోతే పెద్ద గోలచేస్తాడు! నాగభూషణం గారు ముష్టివేసి వచ్చాడు. వాడు ఆ మలుపు తిరిగాడో లేదో ఇంతలో గంగిరెద్దులవాడు వచ్చాడు.

బాబు గారికీ దణ్ణం పెట్టు
అయ్యగారికీ దణ్ణం పెట్టూ
డూడూడూడూ వెంకన్నా

పెద్దమ్మాయి కొడుక్కి గంగిరెద్దువాళ్లంటే ఎంతో యిష్టం! వాళ్లకి డబ్బు వేసి- ఇంతమంది కొడుకులూ కూతుళ్లు కలగాలి అని దీవించుకోవాలి. 14 గురు మగపిల్లలు 12 గురు ఆడపిల్లలు అని వాడు చెప్తే ఎంత సంతోషమో! పిచ్చిపిల్లలు.

"బాబు గారికీ దణ్ణం పెట్టూ!"

'ఒరేయ్! అవన్నీ వాయించ నక్కరలేదు - ఉండు బియ్యం వేసిపంపిస్తాను' అని నాగభూషణంగారు ఒక సోలెడు బియ్యం వేసి చేతులు దులుపుకొన్నారు. అబ్బా! ఎంతమంది బిచ్చగాళ్లు?

అదిగో వెళ్ళాడే బీబీనాంచారీ
వెళ్లాడే బొమ్మ!—అంటూ

బీబీనాంచారమ్మ వచ్చింది. ఇంక ఇలాగ తండోపతండాలుగా వస్తూఉంటారు. ఈ పద్ధతి యెక్కడా లేదు. పండుగలకి తండోపతండాలుగా తరలిరావడం, కలిగినవాళ్లు యీ పేదల కింత పెట్టుకోవడం, ఒక్క తెలుగువాళ్ళకే చెల్లింది. పెద్దపండుగ! పండిన ధాన్యం యిళ్లకువచ్చే పండుగ! పనులూ అవీ పూర్తి అయి అంతా తెఱపిగా ఉండే పండుగ! అబాలగోపాలమూ చేసుకుంటారు. ఆటపాటలతో—

అదుగో! శాస్త్రులుగారు వచ్చారు. సంక్రాంతినాడు చేయవలసిన తర్పణాల మాట ఆలోచించాలి. నాగభూషణంగారు పురోహితులయిన శాస్త్రులుగారితో లోపలికి వెళ్ళారు!

బాగా జాముప్రొద్దెక్కింది. వీరభద్రం స్నానంచేసి బట్టలు వేసుకొని వీధిలోకి వచ్చి నించున్నాడు. "బొజ్జగల తల్లీ!" బొజ్జగల తల్లీ!" మగో కోయది! ఇందాక కోయది మంచిదే. మందిచ్చింది. జ్ఞాపకం వచ్చింది. ఆ మందుతీసి...వణకుతూవున్న చేతితో నొసటమీద పెట్టుకున్నాడు. పెట్టుకొని యెదురింటివైపు పరీక్షగా చూస్తున్నాడు. ఎవరూ కనిపించడం లేదు. ఎదురింటి వెంకు పంతులుగారి కోడలు లోపల ఎక్కడ ఏ పనిలో మునిగిపోయిందో? కిటికీలోంచి చూచినా ఎవరూ లేరు? స్నానాల సమయం, వంట పనులు! ఈసమయంలో ఎవరు కనిపిస్తారు? చూడాలని వెఱ్ఱిచూపు చూడటం తప్ప!

చకాచకా చకాచక్

కత్తులు కొట్టిన చప్పుడు. ఆ కత్తులు ఆడిస్తూ ఒక అందమైన పిల్ల వచ్చింది. మంచి వయస్సులో ఉంది. తలమీద ముసుగు. స్తనవల్కలాలు చుట్టినట్లు గుబ్బలతో రంగుబిళ్ళలు వేసి కుట్టిన గుత్తమైన రవిక. చెవులకి చేతులకి, మెడలోను ఒడిలోను బరువైన ఇనుప నగలు. వాళ్లే జాతి వాగో! 'లంబాడి' వాళ్లంటారు వాళ్ళేమో! అదేం భాష? అలాగ మాటలాడుతుంది! అర్థం కాదు. పిల్ల పిటపిటలాడుతూ మంచివయసులో ఉంది. ఈ కత్తులెందుకు? కత్తులు చూస్తే భయం వేస్తుంది. పూబోళ్లు కటారిక త్తియల్!—చాకులాంటి పిల్ల!

"కత్తి కొంటారా?"అని అడుగుతోంది. కొంటారా చస్తారా అన్నట్టు ఝుడిపిస్తోంది. వీరభద్రం ఏదో మాటలాడబోయాడు. లంబాడీ పిల్ల అతనికేసి దీక్షగా చూచింది. భద్రం పెట్టుకొన్న బొట్టు కనిపించిఉంటుంది! అదేమిటి అలా వెర్రిదానిలాగ చూస్తుంది? పెటమందు పని చేస్తూ ఉందా ఏమిటి? కోయది గట్టిదే! వీళ్ళు ఎంతకయినా తగినవాళ్ళు. ఎంతెంత పనులైనా చేయగలరు! ఇదేమి కర్మ! తీరా ఇది వెంటపడితే? అప్రతిష్ఠ! నాన్న యింటిలో ఉండనీయడు. తరిమేస్తాడు. ఇంకా పరీక్ష ఒకటి ప్యాసు కాలేదు. ఛా! ఈ మనిషిని వదుల్చుకోవడం యెలాగ? కత్తి కొనేస్తేనో! ఒక రూపాయి యిచ్చి కత్తి కొన్నాడు అలాగయినా వదలిపోతుందని! ఆ లంబాడీ పిల్ల కదలదు. పైగా పాతబట్టలు కావాలట. గంజి పొయ్యాలట! అమ్మతో చెప్పి అన్నం పెట్టిస్తేనో! మడి కట్టుకుంది. ఎవరూ తినకుండా యీ లంబాడీదానికి పెట్టుందా? పెట్టదు. ఒక సీతాఫలం పెట్టితే సరి! దానితో ఆకలి తీర్చుకుంటుందేమో!

వీరభద్రం ఒక సీతాఫలం పెట్టి వెళ్ళిపొమ్మన్నట్టు అడిగాడు. లంబాడీపిల్ల కదలదు. వీరభద్రంకేసి చూచి వెకిలిగా నవ్వుతుంది. వింతగా చూస్తుంది. తిష్ఠవేసి కూర్చుంది. సీతాఫలం తిని కడుపునిండా నీళ్ళు తాగింది. ఆ కత్తులమూట అక్కడ పెట్టి, అరుగుకి చేరబడి గుమ్మంచీడీలమీద కూచుంది. వీరభద్రానికి భయంగా ఉంది. ఇదంతా ఆ కోయది ఇచ్చిన పెట్టమందు గుణం అని చెప్పి లోపలికి పోయి బొట్టు చెరుపుకొని వచ్చేశాడు. బుద్ధి వచ్చింది అన్నట్టు లెంపలు వేసుకున్నాడు ఇంకెన్నడూ ఇలాంటి పనులు చెయ్యకూడదని.

లంబాడీ పిల్ల అలాగే కూర్చుంది. సొమ్మసిల్లినట్టు కూర్చున్నదే పడిపోయింది. చీడీమీద పడుకున్నట్టు వాలిపోయింది. ఆ వాలిపోవడంలో పయట జారి ఆమె యవ్వనం అంతా కన్పిస్తూ ఉన్నట్టు కనిపిస్తోంది. వీరభద్రం సిగ్గుపడిపోతున్నాడు. కళ్ళు మూసుకున్నాడు!

ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఇది మందు ప్రభావమా? ఈ మనిషి దొంగ యెత్తు ఏమైనా వేసిందా? ఒక పడుచుపిల్ల అలాంటి దుస్తులతో ఎదురుగా తన ముందు పడిఉండటం బాగా లేదు. ఏం చేయడం? దీనితో ఏం కొంప మునుగుతుందో?

నాగభూషణం గారు బయటికి వచ్చారు. చూశారు. "ఇదేమిట్రా భద్రం! ఈ పిల్లను వీధిలో పడుకోనిచ్చావు? పంపించెయ్ - "అని ఆయన చీదరించుకొన్నాడు. 'పైగా స్పృహ లేనట్టుగా ఉందే?' భద్రం కిమన్నాస్తి మాటలాడడు. 'లేలే' అన్నాడు. ఆపిల్లకి వీళ్లగొడవ వినిపించడంలేదు.

ఏమిటి జరిగిందో చెప్పు అని నాగభూషణంగారు తన వెఱ్ఱిబాగుల కొడుకును నిలదీసి అడుగుతున్నారు. శరపరంపరగా మీద పడే ఆ ప్రశ్నలకి ఏ జవాబూ భద్రం చెప్పలేక తడబడుతున్నాడు. మాట పెగలదు. లంబాడీ పిల్ల కదలదు. వీరభద్రం చివరికి సంగతి చెప్పాడు. పెట్టమందు బొట్టు - ఆపిల్ల చూడడం—నవ్వుతూ పడిపోవడం ఇవన్నీ నాగభూషణం గారి బుద్ధికి నిజంగానే ఉన్నాయి. అప్రతిష్ఠ! తీరని కళంకం! ఇన్నాళ్ళూ పెళ్ళిలేకుండా ఉన్న తన ఏకైకపుత్రుడికి ఒక లంబాడీ పిల్లనిచ్చి పెళ్ళి చేస్తాడా? వాళ్ళు చేసుకోవద్దూ? వాళ్ళు ఎన్నో కట్టుబాట్లు పెట్టుకుంటారు. చూస్తూ చూస్తూ ముళ్లకంపమీద చెంగు వేశాడు భద్రం. అది చిరగకుండా వెనక్కి తీసుకోవడం యెలాగ? పెట్టమందుకొనడం ఏమిటి? ఆ పాడుమందు లెందుకు వీడికి? అవి ఊరోజాల్లో కూడా పని చేస్తాయన్న మాట - ఇదిచూచి ఆ శాస్త్రులు గారయితే వెళ్ళిపోయారు కాని ఇంకెవరైనా చూస్తే ఊరిలో తలెత్తుకోలేము! ఈ వంకను డబాగుంజుకోవాలని యీపిల్ల యెత్తువెయ్య

లతాంతార్ద్రరాగంబు లంబాడి

కదా? అబ్బ! ఆడవాళ్లని నమ్మకూడదు. ఎంతయినా చేస్తారు! కాక వీడికి పెళ్ళి కాక ఈ చిక్కు వచ్చి పడింది. తిన్నగా ఉండటం లేదు. ఆ వెంకుపంతులు గారి కోడలి వైపు ఎందుకు అలాగ చూస్తాడు? రెండు మూడుసారులు కూకలేశాను. వాళ్ల అమ్మ చేతకూడా చెప్పించాను. బుద్ధిలేదు. వాడి నని ఏంలాభం? ఇంతకాలం ఘోటకబ్రహ్మచారిగా ఉండనిచ్చిన నాకు బుద్ధిలేదు. ఈ లగ్నసరిలో ఏ సంబంధమైనా మూచి ముడి పెట్టివేస్తాను. ఇపుడీ చిక్కుదాటి బయట పడాలికదా! ఈపిల్ల అలాగ పడిపోయి ఉంది - ముఖంమీద నీళ్ళు కొట్టి చూస్తాను ఉండు!

నాగభూషణంగారు ప్రథమచికిత్సవంటిది చేశారు. ఆపిల్ల మంచినీళ్ళు తాగింది. కదు లోంది. కాని పూర్తిగా స్పృహ రాలేదు. పొద్దుటినించి విన్న పాటలన్నీ తలలో మెదుల్తున్నాయి. సందుగపూట ఇంటి ముందర ఈ అఘాయిత్యమేమిటి? నలుగురి లోను తలవంపులు! ఎవరినైనా డాక్టరిని పిలిపిస్తే! ఇంకెవ్వరు? ఆయనొక్కడే! శృంగారం! వస్తాడా? ఎందుకు రాడు? డబ్బిస్తే సరి! ఇలాంటి చిక్కు లేనిదంటే. డబ్బిమ్మంటూ డాం? "ఒరేయ్ అబ్బాయి? డాక్టరిని పిలుచుకొనిరా!"

"వెర్రినాన్నా! ఇది నా పెటమందు గుణమేమో!"

"నీముఖం! నే చెప్పినట్టు వెళ్ళి డాక్టరి గార్ని పిలుచుకొనిరా!

డాక్టరు గారువచ్చేలోపున నాగభూషణం గారు లోపలికి వెళ్లారు ముసలావిడవచ్చి చూచింది. పనివాడూ వెంకన్న కనిపెట్టుకొని వున్నాడు. లంబాడి పిల్ల కదుల్తూ ఉంది. కాని ఇల్లు విడిచి వెళ్ళేస్థితిలో లేదు.

ఇంతలో ఒకపెద్ద ముఠా వచ్చారు! లంబాడీమూక. ఆడవాళ్లు మగవాళ్లు! గుంపు! అందరూ ఒక ఉప్పెనలాగ వచ్చి పడ్డారు.

'ఏంబాబు? ఏం చేశారు?' అని కేకలు వేస్తున్నారు. ఆ వాలకం చూస్తే వీళ్ళందరూ ఒక దండయాత్రికని బయలుదేరినట్లు కనిపిస్తున్నారు! నాగభూషణంగారు లోపలినించి బయటికి వచ్చారు. ఈ సందడికి చుట్టు ప్రక్కల యిండ్లవాళ్ళు వచ్చారు. డాక్టరు గారూ వచ్చారు. ఘాటయిన మందు వాసన చూపించారు. వెంకు పంతులు గారి కోడలు పురపురా చూచింది. వీరభద్రం తలయెత్తుకో లేదు.

నాగభూషణం గారు తలెత్తుకోలేకుండా న్నారు. ఏమి అభాండం మీదపడు తుందో? ఇంతవరకు ఊరిలో పెద్దతలకాయ లాగ బ్రతికాడు: ఈ అవమానం ఎలాగ భరించడం?

డాక్టరు పరీక్షచేసి భయంలేదన్నారు. అది ఒకరకం మూర్ఛ, ఫిట్టు, అని తేల్చారు. మందు ఘాటుకి, లంబాడీ పిల్ల లేచి మంచినీళ్లు తాగింది. 'అమ్మయ్య బ్రతికించిందిరా బాబూ ఫరవాలేదు' అని త్వరత్వరగా నాగభూషణం గారు లోపలికి పోతు న్నారు. అక్కడ ఉంటే ఆ పిల్ల ఏం అనరాని మాటలు అంటుందో, ఏం పరాభవం వస్తుందో అని!

వీరభద్రం భయంతో బిక్కుబిక్కు చూస్తున్నాడు.

ఆ పిల్లకి తెలివివచ్చి ఏం చెపుతుందో అని!

"ఓయూ! ఈ బాబ్జీ నన్ను బ్రతికించారు" అని యింకా తన భాషలో గుక్కతిప్పకుండా ఏదో మాటలాడింది. ఆ ముఠా వాళ్ళందరూ "అయ్యగారు! మా పిల్ల ప్రాణం దక్కించారు: మీది మేలూ మరశిపోలేం..." అని వాళ్లల్లో ముఠా పెద్ద లంబాడీ అమ్మి అన్నది. ఆవిడ ఆ పడుచు పిల్ల తల్లి. అందరూ లేచి దణ్ణాలు పెట్టి వెళ్ళిపోయారు.

డాక్టరు గారికి అయిదురూపాయలనోటు చేతిలో పెట్టబోతూ ఉంటే, అనాథ బాలికకు చికిత్స చేసినంత మాత్రానికే ఛార్జీ తీసుకుంటానా? వద్దులెండి అని వెళ్ళిపోయాడు డాక్టరు శృంగారం!

వీరభద్రం - ఆ ముఠా వెళ్ళిన వైపు చూస్తున్నాడు. వెంకు పంతులు గారి కోడలు వింతగా చూచి లోపలికి వెళ్లిపోయింది. ఇంకా ఇరుగు పొరుగు వాళ్లుకూడా ఎవరి యిళ్లల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. పెద్ద కెరటాలు వచ్చిపోయినటయింది.

నాగభూషణంగారు ఆశ్చర్య సంభ్రమాలతో అరుగుమీద పచారీ చేస్తున్నారు.

ప్రొద్దుటనించీ విన్న పాటలు లతాంతార్ద్రరాగాలు వినపడుతున్నాయి గోలగా, గజిబిజిగా!

"పాలకడలి శయన గారా!"

"హరహరా! సాంబ శివశివా!"

"పెళ్లాడే బొమ్మ"

"బొజ్జగల తల్లి బొజ్జగల తల్లి—

బొజ్జగల కోడలు వస్తాది బొజ్జగల కోడలు వస్తాది."

గాలికి చెట్లు రొదచేసినట్టు - మనస్సులో కంగారు. వీరభద్రం మాత్రం వాన వచ్చి వెలిసినట్టు కుదటపడ్డాడు. ఆ తబ్బిబ్బు మన స్సులోని తలపుల ముసుపుల్లో అర్థంలేని ఆలోచనలు. ఆ ఆలోచనల సందులో ఆకారంలేనిపాటల వరుసలు! తీగలేని వీణ: వీణలేని రాగం, తానం, పల్లవి.

భుజంగ ప్రయాతం బుభుక్షిభి మాతం
లతాంతార్ద్ర రాగంబు లంబాడిలంగా!

ఈ పాటలోని కూనిరాగాలు చినిగిపాతల జిలుగు రంగులుగా పిల్కు వీరల చిరునవ్వులుగా శిరస్సులో చిడిముడులు పెట్ట చెదరిన తలపుల్ని చిందర వందర చేస్తున్నాయి. ★

అంతశ్చిత్రాలు

సి. నారాయణరెడ్డి

★

చీకటి పెదవులు నాలోపల
జీవన వేణువు పూరించెను
కాంతి కరమ్ములు నా కన్నుల
గాఢ తమోభారం దించెను.

హైమంత నిశీథం నాలో
అంగారం రేకెత్తించెను
ఆషాఢ పయోదం నాలో
మోహావిరహం పొరలించెను.

ఉరిమిన ఆకాశం నాలో
ఉన్మాదం ఒడలెత్తించెను.
తరళ తటిల్లాసం నాలో
తారుణ్యం పడగెత్తించెను.

ఆరని కర్పూరం నాలో
ఆశాదీపం ముట్టించెను
అందని మందారం నాలో
అనురాగం ననలెత్తించెను.

నాలోన ఉషస్సులు కురిసెను.
నాలోన తమస్సులు మెరిసెను
నాలో పావన జీవన సం
ధ్యాలాసిక కింకిణి మ్రోగెను. ★